సాక్షి
సిద్దిపేట
శనివారం । 20 । మే । 2023



కుంచె పడితే.. చిత్రమే

సిద్దిపేటకు చెందిన అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం కుమారుడు నహీం రుస్తుం వినూత్న చిత్రాలతో చూపరులను ఆకట్టుకుంటున్నాడు. 8లో



గుట్టల్లో గంజాయి విక్రయాలు

చేర్యాల పట్టణ శివారు గుట్టల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకొని కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 8లో

పరీక్ష ప్రశాంతం

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారు ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 192 మందికి గాను 127 మంది హాజరవగా, 65 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ వేణుగోపాల్‌రావు, టీసీఎస్ ఆఫీసర్ మహేష్ బాబు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

ధాన్యంలో తేమ లేకుండా చూడాలి



తేమశాతం పరిశీలిస్తున్న సెర్ప్ అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్

గజ్వేల్‌రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం లేకుండా చూడాలని సెర్ప్ అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్ సూచించారు. గజ్వేల్ మండలం జాలిగామ, గిరిపల్లి గ్రామాల్లో కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ధాన్యంలో తేమ శాతాన్ని పరీక్షించి, కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయనతో ఏపీఎం యాదగిరి, సీసీలు నాగరాజు, రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్

సిద్దిపేటకమాన్: ఈ నెల 21, 22వ తేదీల్లో పొన్నాల శివారు ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమికూడొద్దని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రేషన్ డీలర్లు

సిద్దిపేటరూరల్: తక్కువ కమీషన్‌తో రేషన్ షాపులను నడిపిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రేషన్‌డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కూర ప్రకాశ్ అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డీర్లకు రూ.40 వేలు గౌరవ వేతనం, రూ.10లక్షల బీమా కల్పించాలని, కార్పొరేషన్ వద్ద ఫండ్ ఏర్పాటు చేసి డీలర్లకు రుణాలు అందించాలన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే జూన్ 5 నుంచి సమ్మె చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ బొజ్జ నరేందర్, గౌరవ అధ్యక్షుడు మంద లక్ష్మారెడ్డి, రాష్ట్ర రేషన్ డీలర్ల ఉపాధ్యక్షుడు వంగరి నాగరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు నందకిశోర్, డీలర్లు సత్యనారాయణ, ప్రేమలత, సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల ప్రదర్శనలో 'కుకునూరుపల్లి స్కూల్'



డాక్యుమెంటేషన్ కార్యక్రమంలో ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, తదితరులు

కొండపాక(గజ్వేల్): రాష్ట్ర ఆవిర్భావం జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాల్లో ప్రదర్శనకు కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాల ఎంపికైనట్లు వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి పాఠశాలను సందర్శించారు. మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు 100 శాతం పూర్తవడంతో కుకునూరుపల్లి పాఠశాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రదర్శించేందుకు పాఠశాల అభివృద్ధి పనులను డాక్యుమెంటేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పొల్కంపల్లి జయంతి, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం సర్పంచ్ జయంతి మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు సహకారంతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్యుమెంటేషన్‌లో ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నరేందర్, ఎస్ఎంసీ చైర్మన్ సుదర్శన్, ఉపాధ్యాయులు పద్మ, రాంచంద్రం, శంకర్, శ్రీనివాస్, సీఆర్పీ సంతోష్ తదితరులు ఉన్నారు.

రేషన్.. ఆలస్యం

- సరఫరాలో తీవ్ర జాప్యం
- 63 దుకాణాలకు అందని బియ్యం
- 1.19లక్షల కార్డుదారుల ఎదురుచూపు



మూసి ఉన్న కొమురవెల్లి మండలం గౌరాయపల్లి రేషన్ షాప్

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వం పేదలకు ప్రతీనెలా అందిస్తున్న రేషన్ బియ్యం ఆలస్యమవుతోంది. ఒకటో తేదీ నుంచి రేషన్ షాప్‌ల ద్వారా పంపిణీ కావాల్సి ఉండగా, 19వ తేదీ వచ్చినా జాడలేదు. జిల్లాలో 63 రేషన్ షాప్‌లకు మే నెల బియ్యం అందలేదు. దీంతో కార్డు దారులు రేషన్ షాప్‌ల చుట్టూ తిరుగుతున్నారు. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్‌లకు సరఫరా అవుతుండటంతో ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. పంపిణీ ఆలస్యం కావడంతో ప్రతీ నెలా 18వ తేదీన ముగియాల్సిన గడువును మరో వారం పాటు పొడిగించారు.

అలాట్ అయినా.. అందని బియ్యం

- జిల్లాలో 2,91,595 రేషన్ కార్డులుండగా ఇప్పటి వరకు 1,72,475 మందికి 3507.38 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. ఇంకా 1,19,120 రేషన్ కార్డులకు పంపిణీ కావాల్సి ఉంది.
- మొత్తం 2,91,595 కార్డుల్లో ఒక్కో యూనిట్‌కు 6కిలోల చొప్పున 5,733.61 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది.
- రేషన్ డీలర్ల దగ్గర స్టాక్ 844.72మెట్రిక్ టన్నుల బియ్యం ఉండడంతో 4,888.88మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అలాట్‌మెంట్ చేశారు.
- జిల్లా వ్యాప్తంగా 683 రేషన్ షాప్‌లు ఉండగా 620 రేషన్ షాప్‌లకు మే నెల బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్‌ల ద్వారా చేరుకుంది.
- మే నెలకు సంబంధించి ఏప్రిల్ 27న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు అలాట్‌మెంట్‌ను చేశారు.
- నిబంధనల ప్రకారం రేషన్ షాప్‌లకు అలాట్‌మెంట్ కాగానే ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి బియ్యం సరఫరా కావాలి.
- డీలర్లు 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పంపిణీ చేయాల్సి ఉంటుంది.
- జిల్లాలో బియ్యం నిల్వలు నిండుకోవడంతో జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి రేషన్ బియ్యం సరఫరా అవుతున్నాయి.
- ఎంఎల్ఎస్ పాయింట్‌లలో స్టాక్ లేకపోవడంతో రేషన్ షాప్‌లకు బియ్యం సరఫరా ఇంకా పూర్తి కాలేదు.
- బియ్యం లోడ్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు వస్తేనే అక్కడి నుంచి లోకల్ ట్రాన్స్‌పోర్టు ద్వారా రేషన్ షాప్‌లకు సరఫరా అవుతుంది.
- బియ్యం ఆలస్యం కావడంతో దుకాణాల వద్దకు వచ్చే లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక డీలర్లు షాప్‌లను మూసి ఉంచుతున్నారు.
- ఈ నెల బియ్యం పంపిణీ చేస్తారా లేదా అని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంపిణీ త్వరగా చేయాలని కోరుతున్నారు.

ఇంకా రాలేదు



ఈ నెల రేషన్ బియ్యం ఇంకా అందలేదు. 15వ తేదీ నుంచి రేషన్ షాప్ ఇప్పుడు తీస్తారా అని ఎదురు చూస్తున్నాం. ప్రతీ నెలా ఇలాగే ఆలస్యం అవుతోంది.

– రమేశ్, గట్లమల్యాల

త్వరగా అందించాలి



ప్రతీ నెలా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం సరఫరా ఆలస్యం అవుతుంది. ఈ నెల నంగనూరు మండలంలో సుమారుగా 12 రేషన్ షాప్‌లకు ఇప్పటి వరకు బియ్యం రాలేదు.

– సాయిలు,రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు, నంగనూరు

ఆందోళన వద్దు

జిల్లాలో బియ్యం స్టాక్ లేకపోవడంతో ఇతర జిల్లాల నుంచి సరఫరా అవుతున్నాయి. దీంతో కొంత ఆలస్యం జరుగుతోంది. ఈ నెల 25లోపు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తాం. కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– బ్రహ్మ రావు, డీఎస్‌ఓ

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సీపీ ఎన్.శ్వేత



సిద్దిపేటకమాన్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించినా, నాసిరకం ఎరువులు అంటగట్టినా సంబంధిత దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత హెచ్చరించారు. శుక్రవారం సీపీ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, ఎరువులు, నాసిరకం పురుగుల మందులను విక్రయించినట్లు తెలిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాల నివారణకు టాస్క్ ఫోర్స్ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపులు, గోదాముల్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, విత్తనాలు కొనుగోలు సమయంలో షాపు నిర్వాహకుల నుంచి రశీదు తీసుకోవాలన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాలు, షాపుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని, నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కంట్రోల్ రూమ్ 8712667100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



శిక్షకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏసీపీ సతీశ్

ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: అత్యవసరంలో ఉన్నవారికి సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని ఏసీపీ సతీశ్ అన్నారు. ఫస్ట్ రెస్పాండెంట్ ప్రథమ చికిత్స, సీపీఆర్, ఏఈడీపై శిక్షణ పూర్తిచేసుకున్న హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు చెందిన 10 మంది వలంటీర్లకు శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 24 ఎమర్జెన్సీ చికిత్సలపై వలంటీర్లకు శిక్షణ అందించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించడం, ఎలర్జీ, వెన్నునొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఛాతినొప్పి, డీహైడ్రేషన్, అతిసారం, ఫిట్స్, మూర్ఛ, ఆకస్మిక శిశుమరణాలు, బ్లీడింగ్, కంటి గాయాలు, పాముకాటు, ఆత్మహత్య తదితర అంశాలపై శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ బంధువులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ కిరణ్, ఎస్‌ఐలు మహేష్, నరేందర్ రెడ్డి, వివేక్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి నిర్వాహకులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రామునిపట్ల, అనంతసాగర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కేంద్రంలోని వసతులు, కొనుగోళ్ల నిర్వహణపై ఆరా తీశారు. హమాలీల సంఖ్య పెంచి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని, కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం రామునిపట్ల శివ బాలాజీ రైస్‌మిల్‌ను సందర్శించి, ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని, తాలు, తూకం పేరిట కోతలు విధిస్తే చర్యలు తప్పవని సూచించారు. ఆయనతో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ హరీశ్ తదితరులు ఉన్నారు.

అన్ని సౌకర్యాలతో మోడల్ లేఅవుట్



మోడల్ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ పాటిల్

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సుడా ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలతో మోడల్ లేఅవుట్‌ను సిద్ధం చేసినట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. లేఅవుట్‌లో విద్యుత్, రోడ్లు, తాగునీరు, ఓపెన్ స్పేస్ తదితర వసతులను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సుడా మోడల్ లే అవుట్‌లో అన్ని అనుమతులతో, అందుబాటు ధరలలో ఉన్న ప్లాట్ల కొనుగోలును ప్రజలు విజయవంతం చేయాలన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని విపంచి కళా నిలయంలో సమావేశం ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు సదస్సుకు హాజరై ప్లాట్ల కొనుగోళ్లపై సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

మహిళా సమాఖ్య భవనం పరిశీలన

మిట్టపల్లిలో రూ.4 కోట్లతో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య భవనం, రూ.1కోటితో నిర్మిస్తున్న వృద్ధాశ్రమం, రూ.50 లక్షలతో చేపట్టిన మహిళా ప్రాంగణం పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయనతో డీడబ్ల్యూఓ రాంగోపాల్, ఇంజనీరింగ్ అధికారులు, అర్బన్ ఎంపీడీఓ సమ్మిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు పత్రాలు అందజేత

హుస్నాబాద్: దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, నిత్యం వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నాయని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ అన్నారు. పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో శుక్రవారం మహిళా సమాఖ్య సభ్యత్వ నమోదు పత్రాలను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీజేపీ మోడీ పాలనలో మహిళలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. సమావేశంలో సమాఖ్య నాయకులు నేలవేని స్వప్న, పెద్ది నిర్మల, పొన్నాల స్వప్న, బండి అనసూర్య, శనిగరం స్వరూప తదితరులు ఉన్నారు.



సభ్యత్వ పత్రాలను అందజేస్తున్న పద్మ

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట న్యాయ సహాయ రక్షణ సంస్థ కార్యాలయంలో పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మెన్, న్యాయమూర్తి రఘురాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫీస్ అసిస్టెంట్, క్లర్క్ ఉద్యోగానికి డిగ్రీ ఉత్తీర్ణులై, టైప్ రైటింగ్ ఇంగ్లీష్ హైయ్యర్ పాసై ఉండాలి, తప్పనిసరిగా కంప్యూటర్ అవగాహన కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆఫీస్ ప్యూన్, అటెండెంట్ కోసం పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5గంటల లోపు చైర్మెన్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సిద్దిపేట జిల్లా కోర్టు కాంప్లెక్స్ అడ్రస్‌కు తమ పూర్తి వివరాలను పంపించాలని సూచించారు.

యోగాతో ఒత్తిడిని జయించవచ్చు

జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పక్కన సీపీ శ్వేత

సిద్దిపేటజోన్: యోగాతో ఒత్తిడిని జయించవచ్చని, నిత్య జీవితంలో భాగం కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో హార్ట్ ఫుల్ నెస్, శ్రీరామ చంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. భారతీయ సంస్కృతిలో యోగా భాగమని, యోగాతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యోగా శిక్షణ ఏర్పాటు చేశారని కొనియాడారు. అంతకుముందు పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ... శరీరం, మనస్సు కలయిక యోగా అని, చేస్తున్న పని మీద దృష్టి పెట్టేందుకు సహకరిస్తుందని అన్నారు. అనంతరం నిపుణులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్లు శ్రీదేవి, శోభారాణి, హార్ట్ ఫుల్ సంస్థ ప్రతినిధులు స్వరూప, ప్రతిమ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకుంటే సెర్ప్‌ను ముట్టడిస్తాం



బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న వీఓఏలు

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం వీఓఏల సమస్యలను పరిష్కరించకపోతే సెర్ప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఐకేపీ వీఓఏల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్‌వీ రమ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్ వద్ద వీఓఏలతో కలిసి బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షురాలు కళావతి, బాల్‌లక్ష్మి, వీఓఏలు స్వామి, రుక్మిణి, బిక్షపతి, నర్సింలు, శంకర్, రాజు, మల్లేశం, వెంకటచారి, లత, లక్ష్మీ, రూప, రాధిక, మౌనిక, శ్రీలత, రేణుక పాల్గొన్నారు.

పెద్ద నోటు రద్దుపై..

జిల్లావాసుల భిన్నాభిప్రాయాలు



సిద్దిపేటజోన్: రెండు వేల రూపాయల నోట్ల రద్దు అంశం తెర మీదకు వచ్చింది. భారతీయ రిజర్వ్ బ్యాంకు రెండు వేల నోట్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఈ మేరకు ప్రకటన జారీ చేసింది. మే 23 నుంచి బ్యాంకుల్లో నోట్లను మార్చుకోవాలని సూచించింది. దీంతో మళ్లీ బ్యాంకులకు వెళ్లి గంటల కొద్దీ నిలబడి నోట్లను మార్చుకోవాలా.. అనే సందేహం ప్రజల్లో నెలకొంది. 2016 నుంచి చెలామణిలో ఉన్న రెండు వేల నోట్లను రద్దు చేయడంపై జిల్లా వాసులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

గందరగోళం



రిజర్వ్ బ్యాంకు ఒక్కసారిగా రెండు వేల నోట్ రద్దు చేస్తూ ప్రకటించడం గందరగోళంగా ఉంది. ప్రజల వద్ద ఉన్న రెండు వేల నోట్ల మార్పిడికి ఎక్కువ సమయం ఇవ్వాలి.

– ప్రదీప్, ఉద్యోగి

కొంత ఇబ్బందే..



పెద్ద ఎత్తున రెండు వేల నోట్లు దాచుకున్న వారికి రిజర్వ్ బ్యాంకు నిర్ణయం కొంత ఇబ్బంది కలిగించే అంశమే. పేదవారి మీద ప్రభావం చాలా తక్కువ. ఎందుకు రద్దు చేశారో ప్రజలకు స్పష్టం చేయాలి.

– శ్రీనివాస్, వ్యాపారి

వెసులుబాటు ఇవ్వాలి



రెండు వేల నోట్ రద్దుతో ప్రజలు మళ్లీ బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. నోట్ల మార్పిడికి వెసులుబాటు ఇవ్వాలి. బ్యాంకుల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– సురేందర్, ఉద్యోగి

క్లుప్తంగా

మహిళ ఆచూకీ లభ్యం

బెజ్జంకి(సిద్దిపేట): ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ ఆచూకీని 24 గంటల్లోనే కనుగొని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. మండల పరిధిలోని గాగిల్లాపూర్‌కు చెందిన మహిళ గురువారం ఇంటో నుంచి తల్లికి చెప్పకుండానే వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్ కేసు నమోదు చేసి టెక్నాలజీ సాయంతో ఆమెను వెతికి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం...బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు పలు ప్రధాన చౌరస్తాల్లో తమ సిబ్బందితో కలిసి మూడు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో 8 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.19 వేల జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

కార్మికుడికి గాయాలు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ శివారులోని అరబిందో ఫార్మా యూనిట్- 9లో కార్మికుడికి గాయాలయ్యాయి. విధి నిర్వహణలో ఉన్న కార్మికుడిపై రసాయనాలు పడిగాయాలైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గుండ్ల మాచనూర్ గ్రామానికి చెందిన మన్నే ప్రేమ్‌కుమార్ కొద్ది రోజులుగా అరబిందోలో కాంట్రాక్టు కార్మికుడిగా చేస్తున్నాడు. గురువారం ఉదయం 9 గంటలకు పనికి వెళ్లాడు. స్టోర్‌లో విధులు నిర్వర్తిస్తుండగా రసాయనాలు అతనిపై పడి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పరిశ్రమ ప్రతినిధులు సాయంత్రం సమయంలో హైదరాబాద్ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

నాట్యకళకు జీవం



అవార్డులు తీసుకున్న విద్యార్థులతో మౌనిక

మెదక్ మున్సిపాలిటీ: భరతనాట్యంలో చిన్నారులను తీర్చిదిద్దేలా మౌనిక కృషి చేస్తున్నారు. తన ప్రదర్శనల ద్వారా ఎన్నో అవార్డులు కైవసం చేసుకున్నారు. మెదక్ పట్టణంలో మణికంఠ నాట్య కళాశాలను ఏర్పాటు చేసి చిన్నారులకు నృత్యం నేర్పిస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల తిరుపతిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నమాచార్య స్వర నృత్య నీరాజనం పేరిట ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణికంఠ నృత్యకళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. గతంలో రవీంద్రభారతి, కర్ణాటకలో నిర్వహించిన పలు ప్రదర్శనల్లో సైతం తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. జూన్ 25వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే నాట్య తరంగిణి మహోత్సవంలో పాల్గొంటున్నట్టు చెప్పారు.

కుంచె పడితే.. చిత్రమే

యువ చిత్రకారుడిగా రాణిస్తున్న నహిం





నహిం రుస్తుం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆయన కుంచె పడితే చిత్రం అచ్చు దిగాల్సిందే. ఆ చిత్రాలు ఎందరినో ఆకట్టుకున్నాయి. ఆయనే సిద్దిపేటకు చెందిన అంతర్జాతీయ చిత్రాకారుడు రుస్తుం కుమారుడు నహిం రుస్తుం. చిత్రలేఖనంపై మక్కువతో 10వ తరగతి నుంచి బొమ్మలు గీస్తూ తండ్రి బాటలో పయనిస్తున్నాడు. నాటి నుంచి నేటి వరకు అనేక చిత్రాలు ఆయన కుంచె నుండి జాలువారాయి..అవార్డులూ వచ్చాయి.

సందర్భం ఏదైనా..

సందర్భం ఏదైనా చిత్రం వేయడం నహిం చిన్ననాటి నుంచే అలవాటు చేసుకున్నాడు. తండ్రి వేసే చిత్రాలను చూస్తూ పెరిగాడు. దీంతో ఆయనకు చిత్రలేఖనంపై ఆసక్తి పెరిగింది.

అనేక అవార్డులు..

- నహిం రుస్తుం చిత్రలేఖనాన్ని గుర్తించిన అనేక సంస్థలు, విశ్వవిద్యాలయాలు అవార్డులు ఇచ్చి సన్మానించాయి. న్యూఢిల్లీ కల్చరర్ అసోసియేషన్ ద్వారా యంగ్ ఆర్టిస్ట్ అవార్డుతో పాటుగా రూ.1.20లక్షల నగదు అందుకున్నాడు.
- పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా ఉత్తమ చిత్రకారుడు అవార్డు పొందాడు.
- 2010 సంవత్సరంలో నాటక రంగం ఆధ్వర్యంలోని పురస్కారాన్ని అందుకున్నాడు.
- హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ద్వారా ఉత్తమ చిత్రకారుడు అవార్డు పొందాడు. ఇవే కాకుండా జిల్లాస్థాయిలో అనేక అవార్డులు సొంతం చేసుకున్నాడు.

వేసవి శిక్షణ శిబిరాలు..

పేద విద్యార్థులు చిత్రలేఖనంలో రాణించేలా, వేసవి సెలవుల్లో ఉచితంగా తన తండ్రితో పాటుగా చిత్రలేఖన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాడు. దీంతో అనేక మంది విద్యార్థులు చిత్రలేఖనంలో రాణిస్తున్నారు. కేవలం సిద్దిపేటలోనే కాదు.. బోపాల్, ఢిల్లీ, గుల్బార్గా, ముంబయి లాంటి ముఖ్య పట్టణాల్లో చిత్రలేఖనంపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

ఆన్‌లైన్ ద్వారా చిత్రాల విక్రయం..

నహిం రుస్తుం వేసిన చిత్రలను మోజార్టో(ఆన్‌లైన్) ద్వారా విక్రయిస్తున్నాడు. అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాకు చెందిన అనేక మంది చిత్రలేఖనంపై ఆసక్తి గల ఔత్సాహికులు ఈ చిత్రాలను ఆన్‌లైన్ ద్వారా ఖరీదు చేస్తున్నారు.

ప్రోత్సాహం అందించాలి

64 కళల్లో చిత్రలేఖనం ఒకటి. దీని ద్వారా మానసిక, శారీరక ఒత్తిడి తగ్గుతుంది. ఆలోచన, సృజనాత్మకత, విభిన్న ఆలోచనలు పెంపొందుతాయి. నేను చిన్ననాటి నుంచే బొమ్మలు గీయడం నేర్చుకున్నాను. ప్రతి వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. చిత్రకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలి.

– నహిం రుస్తుం, చిత్రకారుడు, సిద్దిపేట



నహిం రుస్తుం వేసిన చిత్రాలు

గుట్టల్లో గంజాయి విక్రయాలు

పోలీసులకు పట్టుబడిన ఇద్దరు యువకులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారులోని గుట్టల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి చుంచనకోట గుట్టల సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న ఆరుగురు యువకులు పోలీసులను చూసి బైక్‌లు అక్కడే వదిలి పారిపోతుండగా వారిని వెంబడించి ప్రవీణ్, ఆరవింద్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. రెండు బైక్‌లు సీజ్ చేయగా, వంశీ, రాజేశ్, దినేశ్, రాజు పరారీలో ఉన్నారన్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన గంజాయిని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు తమకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. పట్టణంలోని లక్ష్మణ్ గార్డెన్స్‌లో శుక్రవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 14వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ విద్యార్థినులకు చదువుతోనే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయోజకులను చేసేందుకు ఎంతో కష్టపడుతుంటారన్నారు. వారి కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమై తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు సీపీ శ్వేతకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి శాలువా కప్పి మెమొంటోతో సత్కరించారు. అనంతరం కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకామ్‌లలో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులకు బంగారు పథకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల సీపీడీసీ సభ్యులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, లక్ష్మణ్, పరమేశ్వర చారి, కౌన్సిలర్ చందు, నాయకులు దుర్గాప్రసాద్, శివ కుమార్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



పోలీస్ కమిషనర్ శ్వేతకు మెమొంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి

పాలాటలో హైనా సంచారం



సీసీ పుటేజీలో కనిపించిన హైనా

మనోహరాబాద్(తూప్రాన్): మండలపరిధిలోని పాలాటలో హైనా సంచరించినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ఓ ఇంట్లో బిగించిన సీసీ కెమెరాలను పరిశీలించగా, గురువారం రాత్రి హైనా వీధుల్లో సంచరిస్తున్న దృశ్యాలు రికార్డులు అయ్యాయని చెప్పారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. హైనా సంచారంతో పశువుల దొడ్ల వద్ద కాపలా ఏర్పాటు చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

గృహిణి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓగృహిణి అదృశ్యమైంది. పోలీసులు కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో నివాసముండే రేణుక తన భర్తతో ఏదో విషయంలో గొడవ పడింది. దీంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా శుక్రవారం బయటకు వెళ్లిపోయింది. ఆమె సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో పడి వృద్ధుడి మృతి



నారాయణ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): మతిస్థిమితం సరిగ్గా లేని ఓ వృద్ధుడు పొలం పడి మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ మండలం కుసంగి గ్రామానికి చెందిన తమ్మలి నారాయణ(65) పదిహేనురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఆస్తమా కూడా ఉంది. అనారోగ్యంతో అల్లాదుర్గం మండల పరిధిలోని గడి పెద్దాపూర్‌లోని ఓ పొలంలోనే పడి మృతి చెందాడు. అటువైపుగా ఎవరూ వెళ్లకపోవడం వివరాలు తెలియరాలేదు. వారం రోజుల తర్వాత శుక్రవారం శవం కుళ్లిన వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వైద్యులచే మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కూతురు నిర్మల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హరికృష్ణ మృతిపై కుటుంబసభ్యుల అనుమానం

శివ్వంపేట(నర్సాపూర్): హరికృష్ణ మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన యువకుడు హరికృష్ణ ఈ నెల14న విహార యాత్రకు వెళ్లాడు. బుధవారం మురుడేశ్వర్‌లో సముద్ర స్నానం చేస్తుండగా హరికృష్ణకు ఫిట్స్ వచ్చి నీటమునిగాడు. గుర్తించిన తోటివారు ఆస్పత్రికి తీసుకెళుతుండగా, మృతి చెందిన విషయం తెలిసిందే. అక్కడి పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహం అప్పగించగా, శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంది. అయితే హరికృష్ణ మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే అక్కడి పోస్టుమార్టం నివేదిక ఆధారంగా, వాస్తవాలు తెలుస్తాయని, ఇక్కడ కేసు నమోదు చేసే ఆవకాశం లేదని ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

గాయపడిన ఒకరు, ఆత్మహత్యకు యత్నించిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

కుటుంబపోషణ భారమై..



తుమ్మ యాదమ్మ(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలపరిధిలోని దాచారం గ్రామానికి చెందిన తుమ్మ యాదమ్మ(41), తిరుపతి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. కుటుంబ భారాన్ని భుజానికెత్తుకున్న యాదమ్మ తమకున్న కొద్దిపాటి భూమిలో పంటలను సాగుచేస్తూ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. యాదమ్మ చిన్న కూతురు, చిన్న కొడుకు అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో యాదమ్మ కుటుంబ పోషణ భారమై కొంతకాలంగా మనోవేదనకు లోనైంది. ఈ క్రమంలో గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు గజ్వేల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆపై హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ యాదమ్మ శుక్రవారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మన్నె శంకరయ్య మృతదేహం

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం..మండలపరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన మన్నె శంకరయ్య(60) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన రుద్రారం సమీపంలోని హైవే పై ఆటో లో వస్తుండగా సంగారెడ్డి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో శంకరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆపైఉస్మానియాకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



గంగరాజు మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడం.. దంపతుల మధ్య గొడవ నెలకొనడంతో ఓ భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య భాగ్యలక్ష్మి, ఎస్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చింతల గంగరాజు (36) కొంతకాలంగా ఏ పనీ చేయకుండా తిరుగుతున్నాడు. భార్య కూలీ చేసి తెచ్చిన డబ్బులతో ఇద్దరు కూతుళ్లతో సంసారాన్ని నెట్టుకొస్తోంది. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన గంగరాజు భార్యతో గొడవపడి చేయి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భాగ్యలక్ష్మి అత్త అక్కడే ఉంటే మరింత గొడవ జరుగుతుందని భావించి కోడలు, మనవరాళ్లను తన ఇంటికి తీసుకెళ్లింది. శుక్రవారం ఉదయం నిద్ర లేచిన భాగ్యలక్ష్మి ఇంటికి వెళ్లి చూడగా, లోపల నుంచి గడియ పెట్టి ఉంది. ఎంతకూ తలుపు తీయకపోవడంతో పక్కనే ఉన్న కిటికీలో నుంచి చూడగా, గంగరాజు ఇంట్లోని దూలానికి తాడుతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. అత్త, ఇతరుల సహకారంతో తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా, అప్పటికే గంగరాజు మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా గౌరవెల్లి పూర్తి చేశాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): 1.6లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే గౌరవెల్లి రిజర్వాయర్ పనులు దాదాపు తుది దశకు వచ్చాయని ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని శుభం గార్డెన్‌లో అక్కన్నపేట మండలస్థాయి ఆత్మీయ సమ్మేళనం మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా గౌరవెల్లి పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో మరింత స్థాయిలో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికులా పనిచేయాలని సూచించారు. అక్కన్నపేట మండలానికి సబ్ వ్యవసాయ మార్కెట్ మంజూరైందని, నిర్మాణం కోసం 9ఎకరాల ప్రభుత్వ భూమి సైతం అందుబాటులో ఉన్నట్లు గుర్తించారన్నారు.

మల్లంపల్లి, చౌటపల్లి గ్రామాల విలీనం

మండలంలోని మల్లంపల్లి, చౌటపల్లి గ్రామాల విలీనానికి కలెక్టర్‌కు లేఖ రాశానన్నారు. ఇప్పటికే 10 గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం చేయనున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రాథమిక గెజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మల్లంపల్లి, చౌటపల్లి గ్రామాలను కూడా విలీనం చేయాలని, ధర్మారం, మసిరెడ్డి తండా, పోతారం(జే), నందారం గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా విలీనం చేయాలని పట్టు బడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రజని, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీలు మాలోతు భీలునాయక్, రాంచదర్‌నాయక్ పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌కు మా భూములు ఇవ్వం



ల్యాండ్ పూలింగ్ చేయొద్దని తీర్మానం కాపీని రెవెన్యూ అధికారులకు అందజేస్తున్న బ్రాహ్మణపల్లి గ్రామస్తులు

తూప్రాన్: పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో సర్వే నంబరు 44, 45 లోని భూములను ల్యాండ్ పూలింగ్ కోసం ఇవ్వమని రైతులు తీర్మానం చేశారు. శుక్రవారం రైతులతో ల్యాండ్ పూలింగ్ కోసం సమావేశం నిర్వహించేందుకు వెళ్లిన ఆర్ఐ నాగరాజు, సర్వేయర్ బాలకృష్ణలకు తీర్మానం కాపీ అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా భూమిని సాగు చేసుకొని జీవిస్తున్నామని, ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ పేరుతో తీసుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి మున్సిపల్ వార్డు కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం తీసిన తోపులాట



భాను మృతదేహం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇద్దరి మధ్య ఘర్షణ ఓ బాలుడి నిండు ప్రాణం బలికొంది. ఈ సంఘటన మండలంలోని ఇటిక్యాల గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి శ్రీపతి కనకయ్య–స్వప్న దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకొడుకు భాను(6) శుక్రవారం మధ్యాహ్నం తోటి పిల్లలతో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఇంటి వద్ద భానుతండ్రి సమీప బంధువుతో ఘర్షణ పడుతున్నారు. బాలుడు ఏడ్చుకుంటూ ఇద్దరి మధ్యలోకి వెళ్లాడు. ఏం జరిగిందో ఏం తెలియదుగానీ తోపులాటతో బాలుడు కిందపడి తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. ఈ విషయంపై ఎస్ఐ కృష్ణమూర్తిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

స్వచ్ఛ కొమురవెల్లికి సహకరించాలి

డీపీఓ దేవకీ దేవి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్లాస్టిక్‌పై సమరం చేద్దామని, స్వచ్ఛ కొమురవెల్లిగా మార్చేందుకు అందరూ సహకరించాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. శుక్రవారం ఆలయ పరిసరాల్లో దుకాణ సముదాయాలు, కొబ్బరికాయల విక్రయదారులు, లడ్డూ ప్రసాదం విక్రయించే కౌంటర్లను ఆలయ చైర్మన్ గీస భిక్షపతితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లకు బదులు బుట్టలు, పూజసామగ్రి, లడ్డూ ప్రసాదాలను బట్ట సంచులలో విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు , గ్లాసులు, వాటర్ బాటిళ్లు పడేయడంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయని, ప్రైవేట్ వసతి గదుల నిర్వాహకులు స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేసుకొని తడి, పొడి చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేలా చర్యలు చేపట్టాలని ఎంపీఓ మంజులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే చర్యలు తప్పవని అన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో టెండర్ నిర్వాహకుడు శానిటేషన్ చేయాలన్నారు. ప్లాస్టిక్‌ను సేకరించి పంచాయతీకి తీసుకొచ్చేలా ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని కార్యదర్శి లోకేశ్‌కు సూచించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ మల్లికార్జున్ రెడ్డి, స్వచ్ఛ కొమురవెల్లి ప్రత్యేకాధికారి మాధవి, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, మురళీ, కారోబార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు బుట్టలను అందిస్తున్న డీపీఓ దేవకీదేవి



ప్రసాదాన్ని బట్ట సంచిలో పెట్టి అందిస్తున్న దృశ్యం